

కట్టా మల్లేశంను సత్కరిస్తున్న గవర్నర్ బండారు దత్తాత్రేయ

విద్యతోనే సమాజంలో గుర్తింపు

అఫ్జల్‌గంజ్: విద్యతోనే సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. శుక్రవారం గౌలిగూడ మహారాజ్ గంజ్‌లోని శ్రీ సావిత్రికన్య ఉన్నత పాఠశాల 82వ వార్షికోత్సవాలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు బండారు దత్తాత్రేయ, ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ..ప్రతి ఇంట్లో ఆడపిల్లలు ఉంటే అరిష్టంగా భావించే రోజులు పోయి అదృష్టంగా భావించే రోజులు వచ్చాయన్నారు. మహిళలకు మన దేశంలో ఉన్నత స్థానం ఉందని దానిని కాపాడుకోవాల్సిన అవసరం మన అందరిపై ఉందన్నారు. దాదాపు 82 ఏళ్ల క్రితం ప్రారంభమైన ఈ పాఠశాలలో అభివృద్ధి పనుల కోసం తనవంతు సహకారంగా ఇప్పటికే రూ.50 లక్షలు ఇవ్వడం జరిగిందని, భవిష్యత్తులో అవసరమైతే మరింత సహకారం అందించేందుకు తాను ముందు వరుసలో ఉంటానన్నారు. ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం కురుమ మాట్లాడుతూ..పాఠశాల అభివృద్ధి కోసం తన నిధుల నుంచి రూ.5 లక్షలు కేటాయించినా ఉన్నతాధికారులు తిరస్కరించారని దీనిపై ఉన్నతాధికారులతో మరోసారి సమావేశం నిర్వహించి మరిన్ని నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ కట్టా మల్లేశం, అధ్యక్షుడు డి.రాఘవేందర్, టీ క్యాట్ అధ్యక్షుడు చేగూరి వెంకటరమణ, జనరల్ సెక్రెటరి బట్కరి విజయానంద్ తదితరులు పాల్గొన్నారు.

గంగపుత్రుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలి

విజయనగర్‌కాలనీ: గంగపుత్రులు అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని గంగపుత్ర మత్స్యసహకార సంఘం సభ్యులు కోరారు. రాష్ట్ర ఫిషరీష్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్‌కు మాసబ్‌ట్యాంక్‌లోని ఆయన కార్యాలయంలో శుక్రవారం కలిసిన గంగపుత్ర మత్స్యసహకార సంఘం అధ్యక్షులు కట్టలింగం, ప్రధాన కార్యదర్శి మురారి రాంబాబు కోరారు. వారు మాట్లాడుతూ..తమ సొసైటీకి సంబంధించిన కుంటలు, చెరువులు రాజేంద్రనగర్‌తో పాటు ఇతర చోట్ల ఉన్నాయని పేర్కొన్నారు. కబ్జాలకు గురవుతున్న వాటిని పరిరక్షించాలని కోరారు. కబ్జాలపై ఉక్కుపాదం మోపుతూ చట్టపరమైన చర్యలు చేపట్టాలని హైడ్రా కమిషనర్‌తో పాటు ఇతర అన్ని విభాగాల అధికారులకు వినతిపత్రాలు



సాయికుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న గంగపుత్ర సంఘం ప్రతినిధులు

ఇచ్చినట్లు తెలిపారు. మత్స్య కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ..కష్టించి పని చేసే గుణం ఉన్న గంగపుత్రులకు అన్నివిధాల తోడ్పాటును అందిస్తానన్నారు. కార్యక్రమంలో గంగపుత్ర సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో ఉన్నత విద్యాభ్యాసం



మాట్లాడుతున్న ఆచార్య లింబాద్రి

చార్మినార్: అంతర్జాతీయ ప్రమాణాలతో తెలంగాణలో ఉన్నత విద్యాభ్యాసం కొనసాగుతోందని ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య లింబాద్రి అన్నారు. ప్రభుత్వ సిటీ కాలేజీలో నూతన డిగ్రీ కోర్సులపై అధ్యాపకులకు జరుగుతున్న రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ముగింపు సమావేశం శుక్రవారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. విదేశీ విద్యార్థులకు దీటుగా మన విద్యార్థులు కూడా ఉండాలనే సంకల్పంతో అంతర్జాతీయ ప్రమాణాలతో ఉన్నత విద్యను అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాల భాస్కర్, రాజనీతి శాస్త్రం ఆచార్యులు శ్రీలతలతో పాటు డాక్టర్ ప్రవీన్‌కుమార్, డాక్టర్ శ్రద్ధానంద్, సంతోషిని, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ ఎజాజ్ సుల్తానా, డాక్టర్ విప్లవ్ దత్ శుక్లా, డాక్టర్ మల్లికార్జున్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సంగీత, నృత్య పోటీలు

నాంపల్లి: నవ్య నాటక సమితి, తెలంగాణ సంగీత నాటక అకాడమి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో నిర్వహిస్తున్న 49వ జాతీయ స్థాయి అఖిల భారత సంగీత, నృత్య పోటీల కార్యక్రమం శుక్రవారం రాత్రి రెండవ రోజు జరిగింది. ముఖ్యఅతిథిగా తెలంగాణ ఖజానా, గణాంకాల శాఖ ఉప సంచాలకులు జి.వసుంధర హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..యువ కళాకారులు కృషి, పట్టుదలతో నిరంతర సాధనతో పరిపూర్ణ కళాకారులుగా రూపుదిద్దుకోవాలని ఆకాంక్షించారు. నృత్య గురువు డాక్టర్ ఆముక్త మాల్యద మాట్లాడుతూ..చదువులతో పాటు, సంగీతం, నృత్యం వటి రంగాలలో అభిరుచిని పెంపొందించుకోవడం ద్వారా జీవితంలో క్రమ శిక్షణ



డాక్టర్ ఆముక్త మాల్యదను సత్కరిస్తున్న వసుంధర

అలవర్చుకోవచ్చని అన్నారు. నవ్య నాటక సమితి 66 సంవత్సరాల సాంస్కృతికరంగ సేవను ఈ సందర్భంగా అభినందించారు. తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీ వేంకటేశ్వర వేదాంత వర్ధిని కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ నండూరి విద్యారణ్య స్వామి, నృత్య గురువులు రేణుకా ప్రభాకర్, యం.లక్ష్మీ మానస, సంధ్యారాణి, స్నేహా రాంచందర్ పాల్గొన్నారు.

మహానటి సావిత్రి తెలుగువారి ఆరాధ్య దైవం



రచయిత సంజయ్ కిశోర్, విజయ చాముండేశ్వరీని సన్మానిస్తున్న పలువురు నటీనటులు

గన్‌ఫౌండ్రీ: మహానటి సావిత్రి తెలుగువారి ఆరాధ్య దైవమని పలువురు వక్తలు కొనియాడారు. శుక్రవారం రవీంద్రభారతిలో సంగమం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత సంజయ్‌కిషోర్ రచించిన సావిత్రి క్లాసిక్స్ గ్రంథ అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ దర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ.. మహానటి సావిత్రి చరిత్రను ప్రపంచవ్యాప్తంగా తెలియజేసేందుకు ఈ పుస్తకాన్ని ఆంగ్లభాషలోకి అనువాదించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. మహానటి సావిత్రి అనిర్వచనీయమైన నటన ద్వారానే ఎన్టీఆర్, ఏఎన్నార్, ఎస్వీ రంగారావులాంటి మహానటులతో సమానంగా వెలుగొందారని గుర్తుచేశారు. సావిత్రి వీరాభిమానిగా రచయిత సంజయ్ కిశోర్ ఆమె జీవిత చరిత్రను పుస్తక రూపంలోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సావిత్రి కుమార్తె విజయ చాముండేశ్వరీ, సినీనటులు రోజారమణి, వై.విజయ, శివపార్వతి, దర్శకుడు రేలంగి నర్సింహారావు, కిమ్స్ ఆసుపత్రి చైర్మన్ బి.కృష్ణయ్య, సీనియర్ నటుడు చిట్టిబాబు, బుల్లితెర నటి శృతి, సినీ చరిత్రకారులు ఎస్వీ రామారావు, సంగమం ఫౌండేషన్ వ్యవస్థాపకులు సంజయ్ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

అంతరిస్తున్న వృక్షజాతులను కాపాడాలి

చార్మినార్: అంతరిస్తున్న వృక్షజాతులను కాపాడాలని విశ్రాంత ఆచార్యులు మనోహరాచారి అన్నారు. ప్రభుత్వ సిటీ కాలేజీలో వృక్ష శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న వర్క్‌షాప్‌లో శుక్రవారం జరిగిన మొదటి రోజు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వృక్ష వర్గీకరణ, హెర్బేరియం, ఆధునిక పద్ధతులపై సంబంధిత అధ్యాపకులు, విద్యార్థులకు జరిగిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలన్నారు. శాస్త్రవేత్త సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. రిమోట్ సెన్సింగ్ ద్వారా జీవావరణాన్ని గమనించడంతో పాటు పరిశోధించడం తదితర అంశాలు సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాల భాస్కర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విశ్రాంత ఆచార్యులు మనోహరాచారి

తప్పిన పెను ప్రమాదం

- వెంటనే స్పందించిన పోలీసులు
- పోలీసుల తీరును అభినందిస్తున్న పాతబస్తీ ప్రజలు
- వాహనంలోని ఆక్సిజన్ ట్యాంక్, డీజిల్ ట్యాంక్ పేలకుండా చర్యలు
- వాహనం చుట్టూ వలయాకారంగా బారికేడ్ల ఏర్పాటు

చార్మినార్: మిలాద్–ఉన్–నబి వేడుకల సందర్భంగా ప్రమాదావశాత్తు డీజేతో పాటు వాహనానికి మంటలు అంటుకుని పెద్ద ఎత్తున ఎగిసిపడుతున్న సమయంలో బందోబస్తులోని పోలీసులు వెంటనే స్పందించడంతో పెను ప్రమాదం తప్పింది. గురువారం ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు నగర పోలీసులు ర్యాలీలకు అనుమతించారు. దీంతో పాతబస్తీలోని పలు ప్రాంతాల నుంచి ర్యాలీలు మక్కా మసీదు–చార్మినార్‌లకు చేరుకుని ముందుకు కదిలాయి. పొద్దంతా సాఫీగా కొనసాగిన ర్యాలీలు రాత్రి అనుమతి ముగిసిన అనంతరం చార్మినార్ వద్ద డీజేలతో యువకులు కేరింతలు కొడుతూ ముందుకు కదిలారు. మక్కా మసీదు దాటి చార్మినార్ నిమ్రా హోటల్ ముందుకు రాగానే వాహనంలో ఒక్కసారిగా మంటలు వచ్చాయి. చూస్తుండగానే మంటలు ఎగిసిపడి డీజేకు వ్యాపించడంతో వాహనంపై ఉన్న యువకులు కిందికి దూకి తమ ప్రాణాలు దక్కించుకున్నారు. అక్కడే విధినిర్వహణలోని పోలీసులు వెంటనే స్పందించారు.

మంటలు ఆక్సిజన్, డీజిల్ ట్యాంక్‌లకు వ్యాపించకుండా..

డీజే వాహనంలో డీజిల్ ట్యాంక్‌తో పాటు ఆక్సిజన్ ట్యాంక్ కూడా ఉంది. డెకరేషన్ పేపర్లను గాలిలోకి వదలడం కోసం ఈ ఆక్సిజన్ సిలిండర్‌ను వాహనంలో ఏర్పాటు చేసుకున్నారు నిర్వాహకులు. ఒకవేళ ప్రమాదావశాత్తు మంటలు ఆక్సిజన్ ట్యాంక్‌తో పాటు డీజిల్ ట్యాంక్‌కు వ్యాపిస్తే..పెద్ద ప్రమాదం జరిగేది. ముఖ్యంగా ఆక్సిజన్ ట్యాంక్ పేలితే దాదాపు ఒక కిలోమీటర్ వరకు దాని ప్రమాద తీవ్రత ఉంటుందని చార్మినార్ ఏసీపీ చంద్రశేఖర్ తెలిపారు. వాహనానికి పెద్ద ఎత్తున మంటలు వ్యాపించడంతో ఇవి పేలిపోయే ప్రమాదం పొంచి ఉన్న విషయాన్ని గమనించిన పోలీసులు హుటాహుటిన స్పందించారు. మంటలకు తగులబడుతున్న వాహనం వద్దకు ఎవరు వెళ్లకుండా చుట్టూ వలయాకారంలో బారికేడ్లను ఏర్పాటు చేసి జాగ్రత్తపడ్డారు. అందుబాటులో ఉన్న అగ్నిమాపక సిబ్బందితో కలిసి ఎగిసిపడుతున్న మంటలు ఆర్పివేయడానికి సహాయపడ్డారు.



తగులబడుతున్న డీజే వాహనం

పోలీసులకు సహకరించని యువకులు..

ఒకవైపు ప్రమాదం జరుగుతున్నా.. కొంత మంది యువకులు ర్యాలీలు తీసే ప్రయత్నాలు చేయడమే కాకుండా అడ్డుగా పెట్టిన బారికేడ్లను తొలగించే ప్రయత్నం చేశారు. బారికేడ్లను తొలగించే వారిని బందోబస్తులోని పోలీసులు వారించారు. ప్రమాదం పొంచి ఉన్నందును వెంటనే ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని కోరారు. అయినప్పటికీ వినకపోవడంతో తమ లాఠీలకు పని చెప్పారు. అయితే ఇది లాఠీచార్జి అంటూ కొన్ని సోషల్ మీడియాలలో వైరల్‌గా మారింది. దీనికి నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ వెంటనే స్పందించి ఖండించారు.



మాట్లాడుతున్న సీపీ సీవీ ఆనంద్

12 గంటల పాటు పాతబస్తీలో కొత్వాల్..

మిలాద్–ఉన్–నబీ వేడుకల్లో పాల్గొనడానికి గురువారం పాతబస్తీ చార్మినార్‌కు వచ్చిన నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ 12 గంటల పాటు గడిపారు. చార్మినార్ ఏసీపీ కార్యాలయంలో తిష్ట వేసి అక్కడి సీసీ కెమెరాల ద్వారా పాతబస్తీలో కొనసాగిన మిలాద్–ఉన్–నబీ వేడుకల ర్యాలీలను పరిశీలించారు. ఇంతలో రాత్రి 8 గంటలకల్లా ర్యాలీలు ముగుస్తున్నాయని అనుకుంటున్న సమయంలో ఉన్నట్టుండి ఒక్కసారిగా డీజే వాహనం అగ్నిప్రమాదం జరగడంతో సీపీ అలెర్ట్ అయ్యారు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తోసుకొస్తున్న యువకులను వారించడానికి బందోబస్తులోని పోలీసులు ప్రయత్నించారి..ఎక్కడా లాఠీచార్జి జరగలేదని స్పష్టం చేశారు.

భట్టి విక్రమార్కకు లడ్డూ ప్రసాదం అందజేత



సుల్తాన్‌బజార్: ఆధ్యాత్మిక కార్యక్రమాలతో సమాజంలో మార్పువస్తుందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఇస్సామియా బజార్‌లో జై సంతోషి మాత ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడి వద్ద పూజలు అందుకున్న లడ్డూ ప్రసాదాన్ని కమిటీ సభ్యులు సంపత్‌కుమార్, సందీప్‌రెడ్డి, చాణక్య, కార్తీక్‌రెడ్డి శుక్రవారం భట్టి విక్రమార్క నివాసంలో కలిసి అందజేశారు.

రేపు మెగా రక్తదాన శిబిరం



దేవర శ్రీనివాస్

గోల్కొండ: ఈ నెల 22న మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్ అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా నిర్వహిస్తున్న సేవా పక్వాడా కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ శిబిరం ఆదివారం గుడిమల్కాపూర్‌లోని రాజలింగయ్య కబడ్డీ స్టేడియంలో ఉదయం 10 గంటలకు ప్రారంభవుతుందని ఆయన అన్నారు. బీజేపీ అన్ని విభాగాల నాయకులు, కార్యకర్తలతో పాటు స్థానిక యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని ఆయన కోరారు.

రమణీయం.. కూచిపూడి నృత్యం



గన్‌ఫౌండ్రీ: నూపుర కూచిపూడి ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రముఖ నృత్య గురువు ఉదయ్ రేణుక శిష్యురాలు నూపుర కూచిపూడి నాట్య రంగప్రవేశం శుక్రవారం రవీంద్రభారతిలో ఘనంగా జరిగింది. వివిధ అంశాలపై చక్కటి హావాభావాలతో సాగిన నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. శాస్త్రీయ సంగీత కళల వ్యాప్తికి కృషి చేస్తున్న కళా సంస్థలను ఈ సందర్భంగా పలువురు వక్తలు అభినందించారు. ఈ కార్యక్రమంలో శాసన సభ్యులు పాడి కౌశిక్‌రెడ్డి, డ్రీమ్ వ్యాలీ రిసార్ట్స్ ఎండీ కె.సంతోష్‌రెడ్డి, సరస్వతి ఉపాసకులు దైవాజ్ఞశర్మ పాల్గొన్నారు.

ఏఎంఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలి

అఫ్జల్‌గంజ్: మెట్రో వాటర్‌బోర్డులో ఏఎంఎస్ (అన్యువల్ మెయింటెనెన్స్ సెక్షన్ టిండర్స్) రద్దు చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ఓబీసీ సెల్ జనరల్ సెక్రెటరి పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గతంలో చిన్నాచితక కాంట్రాక్టర్ల కడుపు కొట్టేందుకు ఏఎంఎస్ విధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు. శుక్రవారం కాంగ్రెస్ ఎంపీ మల్లు రవిని కలిసి మెమోరాండం అందజేశారు. వాటర్‌బోర్డులో జరుగుతున్న అవినీతి అక్రమాలు, ఏఎంఎస్ ద్వారా కాంట్రాక్టర్ల ఇబ్బందులను ఆయనకు వివరించారు. అనంతరం పోల్కం శ్రీనివాస్ మాట్లాడుతూ..కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏఎంఎస్ విధానంతో ఎంతోమంది చిన్న కాంట్రాక్టర్లు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో అందరికీ న్యాయం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. వాటర్‌బోర్డు ఎండీతో మాట్లాడి కాంట్రాక్టర్లకు న్యాయం జరిగే విధంగా కృషి చేస్తామని మల్లు రవి అన్నారు.



ఎంపీ మల్లు రవిని కలిసిన పోల్కం శ్రీనివాస్

యువ రచయితలను ప్రోత్సహిస్తాం

గన్‌ఫౌండ్రీ: గ్రామీణ ప్రాంతాలలో ఉన్న యువ రచయిత, కళాకారులను గుర్తించి వారికి తగిన ప్రోత్సాహాన్ని అందిస్తామని తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక డైరెక్టర్ మామిడి హరికృష్ణ అన్నారు. శుక్రవారం రవీంద్రభారతిలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, లక్ష్య సాధన ఫౌండేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో యువ రచయిత పి.రమేష్ రచించిన సినీ గీతం ఆవిష్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్ర గ్రామీణ ప్రాంతాలలో ప్రతిభకు కొదువలేదన్నారు. మట్టిలో దాగి ఉన్న మాణిక్యాలను గుర్తించేందుకు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువ రచయిత రమేష్‌కు తల్లిదండ్రులు అందించిన ప్రోత్సాహం ఎంతో విలువైందని కొనియాడారు. అనంతరం రచయిత కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో లక్ష్యసాధన ఫౌండేషన్ చైర్మన్ ప్రజ్ఞా రాజు, వ్యక్తిత్వ వికాస నిపుణులు మోహన్ రావు, ఇన్‌స్పెక్టర్ భీమిడి వెంకట్‌రెడ్డి, నిర్వాహకులు పి.బడేసాబ్‌లతో పాటు పలువురు రచయితలు, సాహితీ ప్రియులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ

ఆసుపత్రి సిబ్బంది పనితీరు అమోఘం



మాట్లాడుతున్న వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్

గోల్కొండ: గోల్కొండ ఏరియా ఆసుపత్రి వైద్యులు, వైద్య సిబ్బంది పనితీరు అమోఘం అని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ డాక్టర్ జె.అజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన గోల్కొండ ఏరియా ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఔట్ పేషంట్ విభాగాన్ని పరిశీలించి అక్కడ జరుగుతున్న ఓపీ రిజిస్ట్రేషన్ ప్రక్రియలను పరిశీలించారు. అనంతరం ఆయన మెయిల్, ఫీమెల్ ఇంజక్షన్ విభాగంతో పాటు ఓపీ డాక్టర్ల గదులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన ఆసుపత్రిలో జరుగుతున్న కాన్పుల వివరాలు, శస్త్ర చికిత్సల వివరాలను అడిగి వాటి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ ఏ.రాజేంద్రనాథ్, సుధాకర్, వైద్యులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో ఉత్సవాలు ప్రశాంతం

గోల్కొండ: అందరి సహకారంతోనే వినాయక నిమజ్జన, మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలు ప్రశాంతంగా ముగిశాయని గోల్కొండ ఇన్‌స్పెక్టర్ సైదులు అన్నారు. మిలాద్ ఉన్ నబీ శాంతి ర్యాలీ విజయవంతంగా ముగిసిన సందర్భంగా శుక్రవారం కాంగ్రెస్ నాయకుడు, పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యులు ఇమ్రాన్ అలీఖాన్ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్‌ను సన్మానించారు. ఆయన మాట్లాడుతూ గోల్కొండలో ఏ వర్గం పండుగలు, ఉత్సవాలు అయినా సరే ఇతర వర్గాలు, మతాల వారు ముందుకు వచ్చి ప్రశాంతంగా జరిగేలా సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పీస్ కమిటీ ప్రతినిధులు ఇలియాస్ అలీ, ఆబిద్, నర్సింగ్‌రావు తదితరులున్నారు.



ఇన్‌స్పెక్టర్ సైదులును సన్మానిస్తున్న ఇమ్రాన్ అలీఖాన్ తదితరులు

చురుగ్గా బీజేపీ సభ్యత్వ నమోదు

అబిడ్స్: బీజేపీ సభ్యత్వ నమోదు గోషామహల్‌లో నిర్వహించారు. శుక్రవారం జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి పి.మురళీధర్‌రావు, బీజేపీ రాష్ట్ర కార్యాలయ కో ఆర్డినేటర్ డి.గోపాల్‌జీ, గోల్కొండ జిల్లా అధ్యక్షులు పాండు యాదవ్ బీజేపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. పలు ప్రాంతాల్లో పర్యటించి బీజేపీ విధి విధానాలను వివరించారు. దేశం బీజేపీ హాయంలోనే సుభిక్షంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ డాక్టర్ సురేఖ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదులో మురళీధర్‌రావు, గోపాల్‌జీ, పాండు యాదవ్

సత్తాచాటిన సెయింట్ ఆన్స్ వాలీబాల్ టీమ్



సాక్షి, సిటీబ్యూరో: ఇంటర్ కాలేజీ జూనియర్ వాలీబాల్ పోటీల్లో మెహిదీపట్నం సెయింట్ ఆన్స్ మహిళా కాలేజీ జట్టు సత్తాచాటింది. సెయింట్ ఫ్రాన్సిస్ జట్టుపై 25–12 తేడాతో విజయం సాధించింది. ఈ సందర్భంగా జట్టు కెప్టెన్ మక్తాల రిషిత మాట్లాడుతూ..కోచ్‌లు ఆంజనేయులు ప్రసాద్, వర్ష శిక్షణ, అధ్యాపకుల ప్రోత్సాహంతో పోటీల్లో రాణించగలుగుతున్నామన్నారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం విద్యార్థినులను అభినందించింది.

కేటీఆర్‌ను కలిసిన ఆనంద్‌కుమార్ గౌడ్



అబిడ్స్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను గోషామహల్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ కలిశారు. శుక్రవారం ఆయనను కలిసి నియోజకవర్గంలో ఉన్న పలు అంశాలపై చర్చించారు. కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని, ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని కేటీఆర్ సూచించారు. తాను అండగా ఉంటానని నియోజకవర్గంలో పార్టీ ఎల్లప్పుడు ప్రజా సంక్షేమంలో, ప్రజాభివృద్ధిలో ముందుండాలని కేటీఆర్ ఆనంద్‌గౌడ్‌తో పేర్కొన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా తిరిగి బీఆర్ఎస్‌దే విజయమని ఆయన అన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయించాలి

అఫ్జల్‌గంజ్: మొదటి దశలో లాటరీ ద్వారా డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు వెంటనే ఇళ్లను కేటాయించాలని స్థానిక నాయకులు కె.శ్రీనివాస్, సరస్వతి, నాగరాజులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనదీప్ దురిశెట్టిని కలిసి వినతిపత్రం అందజేశారు.



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ప్రతినిధులు

సురభికి తైక్వాండోలో కాంస్యం


జియాగూడ: తమిళనాడులో ఇటీవల జరిగిన 2వ ఖేలో ఇండియా ఉమెన్ లీగ్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో జియాగూడ గౌతమ్ మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థిని సురభి కాంస్య పతకం సాధించడం గర్వంగా ఉందని స్కూల్ ప్రిన్సిపాల్ అమర్‌నాథ్ శర్మ అన్నారు. శుక్రవారం స్కూల్ ఆవరణలో విద్యార్థిని సురభి, తల్లిదండ్రులు, తైక్వాండో శిక్షకుడు ముఖేశ్ జోగిని సన్మానించారు. ప్రిన్సిపాల్ అమర్నాథ్ శర్మ మాట్లాడుతూ.. తైక్వాండోలో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం వల్ల సురభి జాతీయ స్థాయిలో రాణించిందన్నారు. డివిజనల్ డీస్ భాస్కర్‌భట్ల కృష్ణమోహన్, డైరెక్టర్ రాజు గైడెన్కర్, కరస్పాండెంట్ ఉమేష్ ఓట్కార్, కోశాధికారులు సురేష్ యాదవ్, తులసిరామసింగ్, కౌన్సిల్ మెంబర్ హరి పాల్గొన్నారు.



సురభి తల్లిదండ్రులను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ అమర్నాథ్ శర్మ

నేడు పాతబస్తీలో శాంతి ర్యాలీ

చార్మినార్: అంతర్జాతీయ శాంతి దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాస్తణ సిటిజెన్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం చందూలాల్ బేలాలోని సుధా టాకీస్ నుంచి శారదా విద్యాలయం వరకు పెద్ద ఎత్తున శాంతి ర్యాలీ నిర్వహిస్తున్నామని కౌన్సిల్ అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్ తెలిపారు. అనంతరం అలియాబాద్‌లోని శారదా విద్యాలయంలో జరిగే సభలో వివిధ రంగాల్లోని నలుగురు ప్రముఖులకు గ్లోబల్ పీస్ అవార్డు–2024లను అందజేయనున్నామన్నారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాష్, ఛత్రినాక ఏసీపీ చంద్రశేఖర్‌లతో పాటు అమెరికాకు చెందిన అమీర్ పీస్ ఫౌండేషన్ అధ్యక్షుడు ఫారూఖ్ అలీ ఖాన్ తదితరులు పాల్గొంటారన్నారు.




రాజ్‌నారాయణ్ ముదిరాజ్

కేంద్ర మంత్రికి వినతి



అబిడ్స్: కేంద్ర క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవియాకు తెలంగాణ హాకీ అసోసియేషన్ ప్రెసిడెంట్ కొండ విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సీఆర్.భీమ్‌సింగ్‌లు మెమోరాండం అందజేశారు. నగరానికి వచ్చిన ఆయనను కలిసి గచ్చిబౌలి స్టేడియంలో కొత్త ఆస్ట్రో టర్ఫ్‌ను రిలే చేయాలని విజ్ఞప్తి చేశారు.

బీజేపీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన



సుల్తాన్‌బజార్: బీజేపీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన లభిస్తుందని జాంబాగ్ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ అన్నారు. శుక్రవారం డివిజన్‌లోని పలు ప్రాంతాలలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున బీజేపీ సభ్యత్వాన్ని తీసుకున్నారు. ఆయన మాట్లాడుతూ..రాష్ట్రంలో బీజేపీని ప్రజలు ఆదరిస్తున్నారన్నారు. హిందూవులకు రక్షణ ఉండాలంటే బీజేపీలో చేరాలని ఆయన సూచించారు. బీజేపీ తెలంగాణ సంఘటన్ మంత్రి చంద్రశేఖర్, బాల్‌రాజ్, రాజ్‌కుమార్, గోపాల్, అమర్‌సింగ్, సుధీర్, మయూర్, అనిల్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.